

నేడు జిల్లా సర్పంచ్‌ల సదస్సు

శ్రీకాకుళం : సర్పంచ్‌ల సమస్యలపై ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యాన ఈనెల 11వ తేదీన జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు రామకృష్ణ నాయుడు, జిల్లా కన్వీనర్ భానోజీనాయుడు తెలిపారు. నగరంలోని హోటల్ గ్రాండ్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించే సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు, సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు పాల్గొంటారని తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలపై సదస్సులో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. జిల్లాలోని సర్పంచులందరూ పార్టీలకు అతీతంగా సదస్సులో పాల్గొనాలని కోరారు.

శివారుకు సాగునీరు ప్రశ్నార్థకమే

- ఈ ఏడాది మరింత పెరిగిన సాగునీటి సమస్యలు
- కాలువల్లో పెద్దఎత్తున పేరుకుపోయిన గుర్రపుడెక్క
- కాలువల్లో నీరుండడంతో పనులు చేయలేని పరిస్థితి
- కొలిక్కి రాని షట్టర్ల సమస్య

జిల్లాలో రానున్న ఖరీఫ్ సీజన్‌లో వంశధార కాలువల ద్వారా శివారు భూములకు సాగునీరందడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. వాటిని తొలగించడానికి నిధులూ విడుదల చేయలేదు. పనులు చేద్దామంటే గ్రామాల్లో నిర్వహిస్తున్న పండగల కోసం కాలువల్లో నీరు విడిచిపెట్టారు. నిధులు విడుదల చేసినా పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు షట్టర్ల సమస్య అపరిష్కృతంగానే ఉండడంతో, కొత్తవి ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది. పాడైన షట్టర్లతోనే నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో గత ఖరీఫ్ నాటి సమస్యలే పునరావృతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ప్రతిఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది.



కోటబొమ్మాళి ప్రాంతంలో ఎడమ కాలువపై ఏర్పాటు చేసిన షట్టర్ల దుస్థితి (ఫైల్)

గుర్రపుడెక్క తొలగింపు ఎప్పుడో..?

పంట కాలువల్లో ప్రస్తుతం పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. కాలువల్లో పనులు చేపట్టకపోతే శివారు భూములకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. 2022 ఖరీఫ్‌లో ఎడమ కాలువ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని చాలా గ్రామాలకు సాగునీరందలేదు. కుడి కాలువ పరిధిలోని గార మండలంలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి. గత ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన పొట్ట దశలో పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోని సుమారు 20 వేల ఎకరాలకు నీరందలేదు. గతేడాదితో పోలిస్తే గుర్రపుడెక్క మరింత ఉధృతంగా పెరిగింది. గుర్రపుడెక్క తొలగింపునకు గతేడాది రూ.60 లక్షలు కేటాయించారు.

ఈ సంవత్సరం నిధుల విడుదలపై ఊసే లేదు. మరోవైపు నిధులు విడుదల చేసినా కాలువల్లో నీరుండడంతో పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది. పలు ప్రాంతాల్లో గ్రామ పండగలు జరుగుతుండడంతో ప్రజాప్రతినిధుల ఒత్తిడితో వంశధార కాలువల్లోకి నీరు విడిచిపెట్టారు. బాగా ఎండిన తర్వాత గానీ గుర్రపుడెక్క, పూడిక తొలగించే పరిస్థితి లేదు. దీంతో తమ పొలాలకు సాగునీరందుతుందో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

షట్టర్ల సమస్యకు ఏదీ పరిష్కారం?

వంశధార శివారు భూముల సాగునీటికి షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిబిఐ కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. ఘటన జరిగి 13 ఏళ్లు అవుతున్నా, నేటికీ విచారణ ఒక కొలిక్కి రాలేదు. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. దాదాపుగా అన్నిచోట్లా షట్టర్లు శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని చోట్ల కొత్తగా షట్టర్లను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలూ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. సాగునీటి ప్రవాహంపై నియంత్రణ లేకపోవడంతో ఎడమ కాలువకు సంబంధించి పోలాకి, సంతబొమ్మాళి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని భూములకు వరకు వంశధార పారడం లేదు. కుడి కాలువకు సంబంధించి గార మండలంలోని భూములు ఎండిపోయాయి. ఈ సంవత్సరమూ షట్టర్ల సమస్యలో ఏ మార్పూ లేకపోవడంతో రైతులకు సాగునీటి వెతలు తప్పేలా లేవు.

ఆయువు తీసిన ఆలస్యం

- బస్సు తప్పిపోవడంతో మహేంద్రతనయ నదిలో పయనం
- నది గోతిలో మునిగి బాలుడు మృతి



ప్రణయ్ మృతదేహం

ప్రజాశక్తి - సోంపేట

ఆలస్యం బాలుని ఆయువు తీసింది. ఊరు వెళ్లేందుకు రావడం ఆలస్యం కావడంతో బస్సు వెళ్లిపోయింది. దీంతో కాలినడకన మహేంద్రతనయ నదిలో నుంచి వెళ్లడంతో గోతిలో పడి బారువకు చెందిన దున్న ప్రణయ్ (7) బుధవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బారువకు చెందిన దున్న చిరంజీవి, గిరిజ దంపతులు ఉపాధి నిమిత్తం అండమాన్‌లో ఉంటున్నారు. స్వగ్రామంలో ఇంటి నిర్మాణం కోసం కుమారుడు ప్రణయ్‌తో కలిసి బారువ వచ్చారు. మండలంలోని దామోదరపురంలో ఉంటున్న గిరిజన తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు ముగ్గురూ బయలుదేరారు. వారు వెళ్లే సమయానికి బస్సు వెళ్లిపోయింది. మహేంద్రతనయ నదిలో నీరు తక్కువగా ఉండడంతో బారువ సమీపంలోని ఆకులతోట గోర్జి నుంచి నది మీదుగా దామోదరపురానికి కాలినడకన వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ముగ్గురూ నదిని దాటుతుండగా నదిలో ఉన్న గోతిలో పడిపోయారు. మునిగిపోతున్న సమయంలో కేకలు వేయడంతో, దామోదరపురానికి చెందిన జి.హేమరాజు నదిలోకి దూకి ముగ్గురినీ రక్షించాడు. అప్పటికే వారు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు సహాయంతో 108లో ముగ్గురినీ సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రణయ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిరంజీవి పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారిలో గిరిజ క్షేమంగా బయటపడింది. కళ్లెదుటే కన్న కొడుకు మృత్యువాత పడడం, భర్త పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కన్నీరుమున్నీరవుతోంది. బాలుని మృతి వార్త తెలియడంతో బారువ, దామోదరపురం గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనపై బారువ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తనూ నరుక్కున్నాడా..?

- జంట హత్యలకు పాల్పడిన వ్యక్తి ఆత్మహత్య!
- వివాహేతర సంబంధానికి మూడు ప్రాణాలు బలి
- ఘటనాస్థలిని పరిశీలించిన ఎస్‌పి రాధిక



రామారావు మృతదేహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఒక వివాహేతర సంబంధం మూడు ప్రాణాలను బలి తీసుకుంది. రెండు జంట హత్యలు, ఒక ఆత్మహత్యకు దారితీసింది. సారవకోట మండలం కోదడ్డపనసలో ఈనెల తొమ్మిదో తేదీన రెండు జంట హత్యలు జరిగిన విషయం తెలిసిందే. హత్యలకు పాల్పడిన వ్యక్తి కూడా బుధవారం కత్తితో పీక నరుక్కున్నాడు. రక్తపుమడుగులో నగ్నంగా పడి ఉండడంతో ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కోదడ్డపనసలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వెలమల భాస్కరరావు, భార్య ఎర్రమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎర్రమ్మకు అదే గ్రామానికి చెందిన ముద్దాడ రామారావుతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసినట్లు తెలిసింది. కొద్దిరోజులుగా రామారావు సమీప బంధువు అవివాహితుడైన సంతోష్‌కుమార్ కూడా ఎర్రమ్మతో చనువుగా ఉంటోంది. విషయం తెలుసుకున్న రామారావు, సంతోష్‌కుమార్‌ను హెచ్చరించాడు.

ఎర్రమ్మతో సంతోష్‌కుమార్ తన సంబంధాన్ని కొనసాగిస్తుండడంతో కసి పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలోనే ఈనెల తొమ్మిదో తేదీన ఎర్రమ్మ, సంతోష్‌కుమార్‌ను దారుణంగా హతమార్చాడు. పోలీసులు తనను వెతుకుతున్నారని సమాచారం తెలుసుకున్న రామారావు బుధవారం కత్తితో పీక నరుక్కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జంట హత్యలకు పాల్పడిన రామారావు కోసం పోలీసులు గాలిస్తున్న సమయంలో ఆయన గ్రామ శివార్లలోని తోటల్లో రక్తపు మడుగులో పడి మృతి చెందడాన్ని గుర్తించారు. ఆ పక్కనే పదునైన కత్తి ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్యల ఘటనలో తనకు ఎలాగూ జైలు తప్పదని భావించి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అవివాహితుడైన ఈయన గ్రామానికి వైస్ సర్పంచ్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

కోదడ్డపనసలో హత్యలు జరిగిన ఘటనా స్థలాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక బుధవారం పరిశీలించారు. తొలుత పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాలను చూశారు. అనంతరం హత్యకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీసి, కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేయాలని అధికారులను ఆదేశించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించి, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరించాలని, సాక్షులందరినీ క్షుణ్ణంగా విచారించి, హత్యకు గల కారణాలను సమగ్రంగా తెలుసుకోవాలని సూచించారు. కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎస్‌పి ఆదేశించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పట్టణ పేదలకు 'ఉపాధి చట్టం'

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పట్టణ పేదలకు ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం సర్వేలో భాగంగా శ్రీకాకుళం నగరం విలీన పంచాయతీ తోటపాలెంలోని యాతపేటలో పర్యటించి బుధవారం పేదలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో సుమారు రూ.20 వేల కోట్లు తగ్గించి బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు రూ.లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తోందని తెలిపారు.



ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న తిరుపతిరావు

ఆన్‌లైన్ మస్టర్లు, యాప్‌లో హాజరు వంటి నిబంధనలు విధించి పేదలను ఉపాధికి దూరం చేస్తోందని విమర్శించారు. కూలీలకు కేటాయిస్తున్న నిధులను వైసిపి ప్రభుత్వం రోడ్లు, భవనాలకు మళ్లిస్తోందన్నారు. ఉపాధి హామీకి ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు, రూ.లక్ష కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గ్రామాలతో పాటు పట్టణ పేదలకు పనులు కల్పించాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమణ, నాగరత్నం, మహాలక్ష్మి, గౌరి, సీత, రాము, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్

89.56 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, టెక్కలి

జిల్లాలో ఎపి పాలిసెట్-2023 ప్రవేశ పరీక్ష బుధవారం ప్రశాంతంగా సాగింది. శ్రీకాకుళం, టెక్కలిలోని మొత్తం 48 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష సాగింది. పరీక్షలకు మొత్తం 12,481 మంది దరఖాస్తు చేసుకోగా 11,178 మంది (89.56 శాతం) హాజరయ్యారు. వీరిలో బాలురు 7,174 మంది హాజరు కావాల్సి ఉండగా 6,493 మంది (90.51 శాతం) పరీక్షలు రాశారు. 5,307 మంది బాలికలు పరీక్షలు రాయాల్సి ఉండగా 4,682 మంది (88.28 శాతం) హాజరయ్యారు. శ్రీకాకుళం ప్రాంతంలో పరీక్షల నిర్వహణను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జి.దామోదరరావు, టెక్కలిలో పరీక్షల సమన్వయకర్త పి.శ్రీనివాసరావు, సహ సమన్వయ బి.శ్రీనివాసరావుతో పాటు పరిశీలకులు సింహాచలం పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు.



టెక్కలి : పరీక్ష రాసేందుకు హాజరైన విద్యార్థులు

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

కవిటి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లను నిర్మిస్తోందని గుంటూరు కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి రత్నాచార్యులు తెలిపారు. మండలంలోని ఎఫ్‌పిఒ ఆధ్వర్యాన నిర్మిస్తున్న కలెక్షన్ సెంటర్‌ను జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి ప్రసాదరావుతో కలిసి సందర్శించారు. అనంతరం ఎఫ్‌పిఒ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 28 కలెక్షన్ సెంటర్లు, 18 సోలార్ కోల్డ్ రూమ్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ 28 కలెక్షన్ సెంటర్లలో 18 సెంటర్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యాయన్నారు. రైతులు తమ ఉత్పత్తులను స్థానిక రైతుసంఘాల ద్వారా కలెక్షన్ సెంటర్లలో భద్రపరుచుకుని మంచి ధరకు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. గోదావరి జిల్లాల కొబ్బరి కంటే ఉద్దానం కొబ్బరి మంచి నాణ్యత కలిగిందన్నారు. ఇక్కడి కొబ్బరితో అనేక ఉత్పత్తులు తయారు చేసి వాటిని స్థానిక ఎఫ్‌పిఒ ద్వారా మంచి ధరకు మార్కెటింగ్ చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. జీడి పంట కూడా మండలంలో విస్తారంగా ఉందని, రైతులు దళారుల బారిన పడకుండా కలెక్షన్ సెంటర్లను ఉపయోగించుకుని మంచి ధరకు విక్రయించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రూ.15 లక్షల నిర్మాణ వ్యయం కలిగిన ఈ కలెక్షన్ సెంటర్లు ఎఫ్‌పిఒ రైతులకు 75 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎఫ్‌పిఒ ఆధ్వర్యాన వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆర్.వి ప్రసాదరావు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కవిటి ఉద్యాన శాఖ అధికారి పి.మాధవిలత, ఎఫ్‌పిఒ అధ్యక్షులు బి.జయప్రకాష్, రైతులు బెందాళం వెంకటేశ్వరరావు, దున్న రంగారావు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌తో మానసికోల్లాసం

శ్రీకాకుళం : ఈతతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని సెట్‌శ్రీ సిఇఒ బి.ప్రసాదరావు, స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హారికా ప్రసాద్ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో గల స్విమ్మింగ్‌పూల్ వేసవి శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల పదో తేదీ నుంచి జూన్ 14 వరకు 34 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. క్రీడాకారులు ఈ శిక్షణ వినియోగించుకోవాలని కోరారు. ఈ ఏడాది కొత్తగా చిన్న పిల్లలకు బేబీ స్విమ్మింగ్‌పూల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి 7.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణలో క్రీడాకారులు క్రమశిక్షణతో తర్ఫీదు పొంది ఉత్తమ క్రీడాకారులుగా తయారు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భాషా, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



'ఉపాధి'లో సమయపాలన తప్పనిసరి

ప్రజాశక్తి - లావేరు

ఉపాధి హామీలో సమయపాలన పాటించాలని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు అన్నారు. మండలంలోని బెజ్జిపురం, చిగురుకొత్తపల్లి పంచాయతీల్లోని బొంతుపేట, ఎస్.కె పల్లి గ్రామాల్లో ఉపాధి పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు పూటలా ఆరు గంటల పాటు పనిచేస్తే గరిష్ట కూలి రూ.272 వస్తుందని తెలిపారు. పని ప్రదేశంలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశంలో తప్పక ఉండాలని స్పష్టం చేశారు. జాబ్‌కార్డుదారులకు వంద రోజులు పని దినాలు కల్పించడమే లక్ష్యంగా పంచాయతీ, మండల స్థాయిలో పనులను గుర్తించామన్నారు. ఉపాధి హామీ అమల్లో జాతీయస్థాయిలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కూలీలు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ సత్యవతి, మాజీ సర్పంచ్ కె.శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం : కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గొండు సీతారాం అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం, పంచాయతీరాజ్, పశు సంరక్షణ శాఖ అధికారులు, మున్సిపల్ ఉన్నతాధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలో వీధికుక్కలు, పెంపుడు కుక్కలకు సంబంధించి యానిమల్ బోర్డు ఆఫ్ ఇండియా రూపొందించిన మార్గదర్శకాలు అమలు తీరు, నగర పరిధిలోని ఎన్ని ఆస్పత్రుల్లో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది?, వీధి కుక్కలను పట్టుకోవడానికి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీధి కుక్కలు కరిచి తీవ్ర గాయాలపాలు కావడం, ప్రాణాలు కోల్పోవడం వంటివి సంభవిస్తే రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా పరిగణించి సుమోటాగా స్వీకరిస్తుందన్నారు. ఉన్నతాధికారులపై క్రమశిక్షణా చర్యలకు సిఫార్సు చేయనున్నామని చెప్పారు. శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ నగరంలో వీధి, పెంపుడు కుక్కల వల్ల దాడులు, స్వైర విహారాలు లేకుండా పశు సంవర్ధక, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయనున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడు గన్నెప్పడు, పంచాయతీ అధికారి వి.కృష్ణారావు, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.వి.ఎస్ కృష్ణారావు, మున్సిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, బాలల రక్షణ అధికారి ఐ.ఎల్ నాయుడు, కౌన్సిలర్ ధర్మాన సీతారాం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద గల డిఎల్‌టిసి, ఐటిఐలో ఈనెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సేనీ హెవీ ఇండస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, మెడ్ ప్లస్‌లో పనిచేసేందుకు ఆసక్తి గల యువతీ యువకులు తమ బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డుతో ఉదయం పది గంటలకు హాజరు కావాలని తెలిపారు. సేని హెవీ ఇండస్ట్రీ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌లో ఐదు సర్వీస్ ఇంజినీర్లు, ఒక పార్ట్స్ మర్చండైజర్ పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఐటిఐ, ఇతర విద్యార్హతలు కలిగి 20 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మెడ్‌ప్లస్‌లో ఫార్మాసిస్టు, ఫార్మాఎయిడ్, సిఎస్ఎ, డెలివరీ బాయ్స్ వంటి 95 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటికి ఆయా పోస్టులను అనుసరించి ఎం.బి.డి ఫార్మసీ, ఎస్ఎస్‌సి పైబడి విద్యార్హతలు కలిగిన 19 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. ఈ పోస్టులకు ఎంపికైన వారు వీరఘట్టం, విశాఖపట్నంలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలు, విద్యార్హత, ఉద్యోగ వివరాలను www.ncs.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

1902కు సమస్యలు చెప్పండి

- వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలకు పరిష్కారం
- సకాలంలో సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానం
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా ప్రజలు ఎటువంటి సమస్యలనైనా 'జగనన్నకు చెబుదాం' ఫోన్ నంబరు 1902కు ఫోన్ చేసి చెప్పవచ్చని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరిస్తామన్నారు. స్పందన, సిఎం పేషీ, మీడియాలో వస్తున్న సమస్యలపై ఇప్పటికే స్పందిస్తున్నామని చెప్పారు. రేషన్‌కార్డుల జారీ, మ్యుటేషన్లు ఇలా ఒక్కో అంశానికి నిర్దిష్ట కాలం నిర్ణయించి వాటిని సకాలంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్పందన వినతులకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితిలో సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఒకే వేదిక నుంచి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి నాలుగు అంచెల విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు.

సంతృప్తి చెందే విధంగా పరిష్కారం

అర్జీ నమోదు, విచారణ, సకాలంలో స్పందన, అర్జీదారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం చూపించుట అనే విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి అర్జీకి నంబరు కేటాయిస్తారని, అర్జీదారునికి మెసేజ్ ద్వారా సమాచారం వస్తుందన్నారు. మెసేజ్‌లో గల నంబరు ద్వారా అర్జీ పరిస్థితిని తెలుసుకోవచ్చని చెప్పారు. అర్జీదారులు సంతృప్తి చెందకపోతే ఎందుకు చెందలేదో తెలుసుకునేందుకు జెడ్‌పి సిఇఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పోలీస్‌శాఖ, డిఆర్‌డిఎ అధికారులతో ఒక ఆడిట్ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు. దీంతోపాటు మండల స్థాయిలో ప్రాజెక్టు మోనటరింగ్ టీమ్‌ను ఏర్పాటు చేశామని, వారు ఫిర్యాదుదారులకు ఫోన్ చేసి సంతృప్తి చెందారో, లేదో తెలుసుకుంటారని చెప్పారు.

'స్పందన'కు బూస్టర్ డోసు

జిల్లాలో ఇప్పటివరకు 3,857 మందికి కాల్ సెంటర్ ద్వారా ఫోన్లు వెళ్లాయని, అందులో రెండు వేల మంది స్పందించి సమాధానం ఇచ్చారని తెలిపారు. ఫోన్లు రిసీవ్ చేసుకున్న 1,129 మంది సంతృప్తి చెందలేదన్నారు. సమస్యల పరిష్కారంపై 1,034 మంది పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. జిల్లాలో 732 గ్రామ సచివాలయాలు ఉన్నాయని, ఇందులో ఏడు వేల మంది కార్యదర్శులు, 13 వేల మంది వాలంటీర్ల వ్యవస్థ ఉందన్నారు. ఇంత పెద్ద వ్యవస్థ ఉన్నపుడు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకునేలా ఉండాలన్నదే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

స్పందన కార్యక్రమానికి ఇది బూస్టర్ డోస్ వంటిదని అభివర్ణించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం అందజేయడంలో జిల్లా ముందంజలో ఉండేలా అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్ తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మంత్రి అప్పలరాజు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని మహాదేవిపురానికి పాత హైవే నుంచి కాళీమాత ఆలయం వరకు రూ. 86 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న తారు రోడ్డు, బ్రిడ్జి, సేఫ్టీ వాల్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ముందుగా మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్యదొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఐఐపి వన్-బి కింద రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపేట వేస్తుందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతు వెంకటరావు, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, సర్పంచ్ హనుమంతు అనురాధ, వైస్ ఎంపిపిలు తమ్మినేని శ్రావణి శాంతారావు, వంక రాజు, పలాస మున్సిపల్ చైర్మన్ బల్లా గిరిబాబు పాల్గొన్నారు.


మెమోంటోను అందుకుంటున్న తైక్వాండో శ్రీను

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీను

ప్రజాశక్తి- నరసన్నపేట

క్రీడల్లో రాణించాలన్న తపన క్రీడాకారులకు ఉండాలని, తద్వారానే పోటీతత్వం అలవాటవుతుందని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను అన్నారు. నరసన్నపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్, తైక్వాండో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. చిన్నతనం నుంచే ఎంచుకున్న క్రీడా రంగంలో మెళకువలను నేర్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. క్రీడల ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ అలవాటు పడుతుందన్నారు. క్రీడా కోటా ఉండడంతో రిజర్వేషన్లు వర్తిస్తాయని అన్నారు. క్రీడాకారులకు శిక్షణను ఇస్తున్న ఫుట్‌బాల్ కోచ్ రాకేష్, తైక్వాండో కోచ్ నవీన్‌లను అభినందించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు సచిన్, స్పోర్ట్స్ సుగుణ కుమార్, పిఇటి కుంచి గోపి, పీడీ డి.భవానీ, శివ, శ్రీను, నివాస్, అనిల్ పాల్గొన్నారు.

స్పీకర్ ఆదేశాలు బేఖాతర్

- బిక్కుబిక్కుమంటున్న అల్లిపల్లిగూడ ఆదివాసీలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

ఊరు మారినా సమస్యలు తీరడం లేదని అల్లిపల్లిగూడ ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వేరే జిల్లాలో నివాసం ఉన్న మాకు తినటానికి తిండి లేక, ఉండటానికి ఇల్లు లేక, తాగడానికి గుక్కెడు గంజి నీళ్లు దొరక్క, ఆకలితో అలమటిస్తూ... పొట్టచేత పట్టుకుని చంటి పిల్లలను సంకనేసుకుని, వృద్ధాప్యంలో ఉన్న కన్నవారినీ విడిచిపెట్టి పట్టేడు అన్నం కోసం మండలంలోని వైకుంఠపురం పంచాయతీ కొండకోనల్లో ఉన్న అల్లిపల్లిగూడలో పూరిగుడిసెలు వేసుకుని కుటుంబాలను నెటుకొస్తున్నారు. ఇక్కడకు వచ్చి 12 ఏళ్లు గడిచిపోయాయి. అడవినే నమ్ముకుని ఇక్కడ సాఫీగా జీవనం సాగుతుంది. ఇంతలో గతేడాది గ్రామానికి సమీపంలో ఉన్న కొండల్లో క్వారీ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి కొండల్లో పెద్ద పెద్ద బాంబులు పెట్టి రాళ్లను పేల్చుతున్నారు. ఆ రాళ్లు ఇళ్లపై పడడంతో దెబ్బతింటున్నాయి. అలాగే చిన్న చిన్న గాయాలు తగులున్నాయి. వారి బాధలు, గాథలు ఎరికి చెప్పినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఏం చేయాలి? ఎలా బతకాలి? ఇంకా ఎక్కడికి వెళ్లాలి? అంటూ ఆదివాసీలు హృదయ విదారకంగా రోధిస్తున్న తీరును అందరినీ కలచివేస్తుంది. ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ స్పందించి నిలుపుదల చేయాలని అక్కడే ఉన్న అధికాలకు ఆదేశించారు. కానీ, అధికారులు స్పీకర్ ఆదేశాలను భేఖాతరు చేశారని ఆదివాసీలు వాపోతున్నారు. ఈ క్షణంలో ఏం జరుగుతుందోనని ఆదివాసీలు భయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదివాసీలు కోరుతున్నారు.

దీనిపై తహశీల్దార్ రమణారావును వివరణ కోరగా... అల్లిపల్లిగూడ క్వారీ సరుబుజ్జిలి రెవెన్యూ పరిధిలో ఉందని తెలిపారు. ఆదివాసీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల కాలంలో మైన్స్ ఎడి, ఆర్‌డిఒ క్వారీని సందర్శించి వివరాలు సేకరించారని అన్నారు. వారి నుంచి వచ్చిన సమాచారం


అల్లిపల్లిగూడ

మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం క్వారీ సీజ్ చేయమని సంబంధితశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

మా పిల్లల ప్రాణాలు కాపాడండి



క్వారీలో మరింత ఉధృతం చేస్తున్న బాంబు పేలుళ్ల కారణంగా మా పిల్లలు ప్రాణాలను కోల్పోయే పరిస్థితి ఉంది. వారి ప్రాణాలను మీరే కాపాడండి. బంగారు భవిష్యత్ ఉన్న మా పిల్లల జీవితాలకైనా భరోసా కల్పించాలి. అనుక్షణం భయంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నాం. 12 ఏళ్ల క్రితం బతుకు తెరువు కోసం వచ్చాం. ఇక్కడా ప్రశాంతంగా బతలేకపోతున్నాం. **- హారిక కమల**

పకడ్బందీగా 'నీలమణిదుర్గ' ఉత్సవాలు

టెక్కలి: టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని పాతపట్నంలో ఈ నెల 24 నుంచి 30 వరకు నిర్వహించనున్న నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు నిర్వహణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దని సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నం రోడ్లు విస్తరణతో పాటు రోడ్లు పక్క ఉన్న ఆక్రమణలను తొలగించాలని అన్నారు. ప్రస్తుత వేసవి దృష్ట్యా సంబరాల్లో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. అవసరం అనుకున్న చోట ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అన్నారు. బోర్లు, కుళాయిలు మరమ్మతులకు గురికాకుండా చూడాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు సూచించారు. పారిశుధ్య నివారణ చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టి వ్యాధులు


సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రబలకుండా చూడాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పోలీస్‌శాఖాధికారులకు సూచించారు. సమావేశంలో రెవెన్యూ, రహదారులు, భవనాలు, పంచాయతీ, పోలీస్, దేవాదాయ ఉత్సవ కమిటీ అధికారులు పాల్గొన్నారు.


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సంక్షేమ సారథి జగన్

కోటబొమ్మాళి: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందించారు. ఇందులో భాగంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులతో, వికలాంగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్ల ఇన్‌ఛార్జి గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు, ఎంపిటిసి బొడ్డు అప్పన్న, మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజు పాల్గొన్నారు.

రేపు నందిగాం మండల సమావేశం

నందిగాం : ఈ నెల 12న మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి నడిపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. విధిగా ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొవాలన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

ఉద్యాన పంటలపై అవగాహన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని గిరిజన పంచాయతీలైన గొట్టిపల్లి, అడ్డంగి గ్రామాల్లో కలెక్షన్ సెంటర్‌లోని కోల్డ్‌స్టోరీ పంటలను ఉద్యానవన ప్రత్యేకాధికారి ఎస్.వి.వి.రత్నం, ఆచార్యులు ఆర్.వి.వి.ప్రసాదరావులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యానవన పంటలు నిల్వ చేసుకుని గ్రేడింగ్ చేసుకుని మార్కెటింగ్ చేసుకొంటే రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. అనంతరం కోల్డ్‌స్టోరేజీ విధానాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.సంజీవరావు, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రత్నం

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి టౌన్ ఫీడర్ పరిధిలో ఉన్న శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు వెడల్పు పనుల కారణంగా పొడవాటి స్తంభాలు మార్చడం, విద్యుత్ తీగలు అమర్చుతున్నామని అన్నారు. 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, కంచరవానిపేట, లంకాం, రైస్‌మిల్ అండ్ బ్రిక్ ఇండస్ట్రీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


బ్యాటింగ్ చేస్తున్న వెంకటరావు

క్రీడల్లో రాణించాలి

మెళియాపుట్టి : యువకులు క్రీడల్లో రాణించాలని సిపిఐ నాయకులు లండ వెంకటరావు అన్నారు. మండలంలో మురికింటిభద్రలో యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ముందుగా బ్యాంటింగ్ చేశారు. వారం రోజులు పాటు 30 టీమ్‌లతో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టి.మల్లేష్, ఎల్.శ్రీనివాస్ పాల్గొన్నారు.


నిల్వ చేసిన కలప దుంగలు

పచ్చదనానికి తూట్లు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పచ్చదనానికి అక్రమార్కులు తూట్లు పొడుతున్నారని మండల వాసులు ఆరోపిస్తున్నారు. కాలువలపై ఉన్న ప్రభుత్వ చెట్లను అక్రమార్కులు నరికివేసి కలపను జోరుగా ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అయినా పట్టించుకునే నాథుడే లేకుండాపోయారని స్థానికులు వాపోతున్నారు. అందరూ చూస్తుండగానే బూర్జ సమీపంలోని జగిల్‌గెడ్డపై ఉన్న కలపను అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ, నీటిపారుదల, అటవీ శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శిస్తున్నారు. ఇదే కొనసాగితే సాగునీటి కాలువలపై ఒక్క చెట్టు కూడా కనిపించదని చెబుతున్నారు. భవిష్యత్‌లో అడవులు మాయమైనా ఇదే పరిస్థితి నెలకుంటుందని పచ్చదనం ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పలువురికి ఆర్థికసాయం

కవిటి: వారంతా చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. కాలక్రమంలో ఎవరి వృత్తుల్లో వారు స్థిరపడ్డారు. అయితే వారితో కలిసి చదువుకున్న స్నేహితుడు తన కుమార్తె వివాహానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకుని తలో చేయివేసి అతనికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని దూగానుపుట్టుగకు చెందిన తట్ట మోహనరావు కుమార్తెకు వివాహం నిశ్చయమైంది. అయితే మోహనరావు ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న స్నేహితులు బుధవారం అతనికి రూ.50 వేలు అందించారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన స్నేహితులకు మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దూగాన భద్రాచలం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ఎస్‌సి వీధికి చెందిన రగడ సత్యం అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు సత్యం భార్య సూరీడమ్మకు రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే నేతాజీనగర్‌కు చెందిన చంద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన భార్య గంగమ్మకు ట్రస్టు తరుపున రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జగదీష్, లోకేష్‌లు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని నీలాపురానికి చెందిన బి.రామకృష్ణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మెట్టవలస జెడ్‌పి పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.52 వేలు మృతుడి కుటుంబ సభ్యులు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మజ్జి రామ్మూర్తి, కృష్ణ, రామునాయుడు, రాంబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటు ఎప్పుడో?

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో గ్రామంలోని చెత్తా చెదారాలను రహదారికి ఇరువైపులా పడేస్తున్నారు. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కొందరు చెత్తను మహేంద్ర తనయా నది తీరంలోని పలాస-పర్లాకిమిడికి ప్రధాన రహదారికి ఓ వైపున వేస్తున్నారు. దీంతో ఆ రహదారిలో ప్రయాణించే వారు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది. ఇంకొందరైతే నదిలోనే పడేస్తున్నారు. నదితీరాన స్వర్ణధామానికి వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే డంపింగ్ యార్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ పి.చంద్రకుమారి, సర్పంచ్ రేఖన లక్షుమ్మలను వివరణ కోరగా... డంపింగ్ యార్డు నిర్మాణానికి రూ.5.92 లక్షల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. అనుమతులు వచ్చాయని, సరైన ప్రదేశాన్ని గుర్తిస్తున్నామని అన్నారు. త్వరలోనే స్థలాన్ని గుర్తించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


ప్రధాన రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

డిఎస్‌పి బాధ్యతల స్వీకరణ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఐలు, ఎస్‌ఐలు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి డివిజన్ నూతన డిఎస్‌పిగా నియమితులైన డి.బాలచంద్రారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాల విభజన నేపథ్యంలో టెక్కలి పోలీస్ సబ్ డివిజన్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విభజన వెంటనే ప్రభుత్వం తొలుత డిఎస్‌పిని నియమించింది. కానీ ఆయన బాధ్యతలు స్వీకరించలేదు. మరలా రెండోసారి డిఎస్‌పిగా బాలచంద్రారెడ్డిని పది రోజుల క్రితం నియమించింది. ఈయన కొనసీమ అంబేద్కర్ జిల్లా రామచంద్రాపురం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. స్థానిక పాత సర్కిల్ కార్యాలయాన్నే డిఎస్‌పి కార్యాలయంగా తీర్చిదిద్దారు. టెక్కలి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం సర్కిల్ కార్యాలయాలు ఉన్నారు. ముందుగా బాలచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా ఎస్‌పి జి.ఆర్.రాధికను కలిశారు. బాధ్యతలు స్వీకరించిన డిఎస్‌పి ని టెక్కలి, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం సిఐలు సూర్యచంద్రమౌళి, రాము, వేణుగోపాల్, వినోద్‌కుమార్‌లు, ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

కూన రవి అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం

వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస


చింతాడ రవి

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పాల్పడిన అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమేనని వైసిపి ప్రచార విభాగం ఛానల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ సవాల్ విసిరారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు వచ్చే తేదీలను ప్రకటించాలని అన్నారు. భూ కబ్జాలు, అక్రమమైనింగ్‌లకు సంబంధించి తన వద్ద ఆధారాలు ఉన్నాయని, కూన రవికి దమ్ముంటే బహిరంగ చర్చకు వచ్చి తన సచ్ఛీలతను నిరూపించుకోవాలని అన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రజా సంఘాల నేతలను, జిల్లాకు చెందిన న్యాయవాదులను పిలిచి వారి సమక్షంలో బహిరంగంగా చర్చిద్దామని సవాల్ విసిరారు. కూన రవి సచ్ఛీలుడని నిర్ధారణ అయితే జీవితంలో తాను ఆయన గురించి మాట్లాడనని అన్నారు.

అవయవదాత పేరున స్కాలర్‌షిప్

ప్రజాశక్తి- సోంపేట

సోంపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి మల్లారెడ్డి కిరణ్‌చంద్ ఇటీవల బ్రెయిన్ డెడ్‌తో మృతి చెంది అవయవదానం చేసి నలుగురి ప్రాణాలను బతికించిన ఆయన అందరికీ ఆదర్శనీడని, అందుకే అతడి పేరున స్కాలర్‌షిప్ అందించేందుకు నిర్ణయించున్నాని సీడప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కుల సాధించిన నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటే స్కాలర్ షిప్‌ను అందజేస్తానని అన్నారు. వాట్సాప్ నంబరు 8790638785కు విద్యార్థులు తమ మార్కుల జాబితాతో పాటు పూర్తి వివరాలు పంపిస్తే అర్హులైన వారికి స్కాలర్‌షిప్‌లను అందజేస్తానని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు దుర్గారావు కోరారు. మండలంలోని టెక్కలిపట్నం, రామకృష్ణాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆఫ్‌షోర్ రిజర్వాయరు కోసం త్యాగం చేసిన నిర్వాసిత కాలనీలకు రోడ్డు, డ్రెయినేజీ, వీధి లైట్లు ఇప్పటికీ కల్పించకపోవడం దారుణమన్నారు. కొండకు ఆనుకొని ఉండటంతో పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయని, పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని నిర్వాసితులు దుర్గారావు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. చీకటి పడితే ఎలుగు సంచారం ఎక్కువగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోతే జనసేన పార్టీ తరుపున పోరాటం చేస్తామని దుర్గారావు హెచ్చరించారు.


సమస్యలు తెలుసుకుంటున్న దుర్గారావు

కిడ్నీ వ్యాధి నియంత్రణపై ప్రత్యేక దృష్టి

కవిటి: కిడ్నీ వ్యాధి నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని పలాస ఆర్‌డిఒ టి.సీతారామమూర్తి తెలిపారు. మండలంలోని బొరివంకలో రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కిడ్నీ బాధితులకు కిడ్నీ వ్యాధి నియంత్రణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కిడ్నీ వ్యాధి నియంత్రణకు కృషి చేస్తుందని అన్నారు. గ్రామాల్లో మీరూ ప్రజలకు కిడ్నీ వ్యాధి నియంత్రణపై పై అవగాహన కల్పించాలని సూచించారు. డయాలసిస్ రోగులకు గతంలో మూడు షిఫ్టుల్లో డయాలసిస్ నిర్వహించేవారని అన్నారు. ప్రస్తుతం వారి సౌకర్యార్థం నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే కవిటి, సోంపేట


మాట్లాడుతున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి

సిహెచ్‌సిల్లో డయాలసిస్ బెడ్లు పెంచేందుకు అదనపు గదులు అందుబాటులో లేకపోవడంతో కంటైనర్ల ద్వారా అదనపు బెడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. దీని ద్వారా మరో ఆరు చొప్పున అదనపు బెడ్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న వ్యాధి తీవ్రతను బట్టి ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య పరీక్షలునిర్వహించుకోవాలని సూచించారు. అందులో ముఖ్యంగా అనారోగ్యానికి గురైన వారు కచ్చితంగా కిడ్నీ పరీక్షలు నిర్వహించుకోవాలని అన్నారు. వ్యాధి తీవ్రతను ముందే గుర్తిస్తే మెరుగైన వైద్యంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. డాక్టర్లను సంప్రదించకుండా మందుల దుకాణాల్లో మందులు కొనుగోలు చేసుకుని వాడడం ఆరోగ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రతి ప్రభుత్వాస్పత్రిలోనూ మెరుగైన వైద్యులు ఉన్నారని, అనారోగ్యానికి గురైతే ఆర్‌ఎంపిల వద్దకు కాకుండా ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ విషయాలను రెవెన్యూ, సచివాలయం సిబ్బందితో పాటు వాలంటీర్లు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.సంతోష్, ఎస్ఐ కె.రాము, డాక్టర హరిత, సర్పంచ్ బెందాలం శ్రీరాం ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎఫ్‌పిఒ అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ పాల్గొన్నారు.

స్కిల్స్ హబ్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని కంచిలి మండలంలో స్కిల్స్ హబ్‌ను ఏర్పాటు చేయాలని సీడ్ ఎపి చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఎపిఎస్‌ఎస్‌డిసి ఎండీ వినోద్‌కుమార్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధికంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశాలకు కార్మికులుగా వెళ్లి జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. వారిలో చాలామంది పదో తరగతి, అంతకన్నా తక్కువగా చదువుకుని సరైన స్కిల్స్ సెట్ లేకుండా టెక్నికల్‌గా ప్రాథమికమైన అంశాలు నేర్వకుండా విదేశాలకు వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాసిరకం పనులు చేస్తూ... జీవనం గడుపుతున్నారని అన్నారు.

అక్కడ సంపాదన చాలక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ శిక్షణ కల్పించేందుకు, తద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పనకు స్కిల్స్ హబ్ ఏర్పాటు చేస్తే వారికి సహాయపడుతుందని అన్నారు. వెల్డింగ్, ఫిట్టర్, రిగ్గింగ్ వంటి ఏర్పాటు చేస్తే యువతకు మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కంచిలిలో స్కిల్స్ హబ్ ఏర్పాటు చేస్తే ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట తదితర మండలాల యువతకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ విషయంపై ఎండీ సానుకూలంగా స్పందించారని శ్యామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి


సన్మానిస్తున్న తులసీదాస్‌రెడ్డి

పురుషోత్తంనాయుడుకు సన్మానం

ఇచ్ఛాపురం : ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ చౌదరి పురుషోత్తంనాయుడు ఇచ్ఛాపురంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత శ్రీస్వేచ్ఛావతి సంబరాల్లో బుధవారం పాల్గొన్నారు. ఈ మేరకు స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి పాఠశాల ఆవరణలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఉద్యోగుల సంఘం నేతగా అందరికీ సుపరిచితుడు కావడంతో పురుషోత్తంనాయడును కలవడానికి పలువురి వచ్చి అభినందనలు తెలిపారు. అమ్మవారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణు, పి. అప్పారావు, సదాశివ శ్రీనివాస్, కల్లెపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, చాట్ల లోహిదాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయవంతంగా వేసవి విజ్ఞాన శిబిరం

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఉత్తరాంధ్ర జోనల్ కో-ఆర్డినేటర్ మాకన శ్యామల గణితశాస్త్రం గురించి వివరించారు. చాలామంది చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచే లెక్కలు అంటే భయం ఉంటుందని, ప్రాథమిక స్థాయి నుంచి గణిత శాస్త్రంపై పట్టు సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా లెక్కల్లో స్థాన విలువలు, విస్తరణ రూపం, బిన్నాళ్లు, శాతాలు, ఒకటి నుంచి వెయ్యి వరకు స్థానాల విలువ గురించి తెలిపారు. విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ జి.రామారావు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు. అలాగే మురపాక శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా రిసోర్స్ పర్సన్ కనక రాజు చిన్నారులకు గణితంలో జిమ్మిక్కులు గురించి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగరంలోని జిల్లా శాఖాగ్రంథాలయంలో తెలుగు ఉపాధ్యాయులు టి.ఎర్రమ్మ, పి.సాయికృష్ణ పిల్లలకు జనరల్ నాలెడ్జ్, నీతి కథలు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.వి.జి.ఎన్.శంకర రావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు వల్ల పిల్లలు కొత్త అవకాశాలను అన్వేషించడానికి, కొత్త వాతావరణంలో సమయాన్ని గడపడానికి, కొత్త విషయాలను ప్రయత్నించడానికి అవకాశముందని అన్నారు. లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, పి.ఈశ్వరరావు, గణేష్, టి.రాంబాబు పాల్గొన్నారు.

బలగ : నగరంలోని బలగ శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఇ.ఉగ్రసేన పిల్లలకు నీతి పద్యాలు, తాత్పర్యాలు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యమ్రకంలో సహాయకులు కె.అనిత, 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


టెక్కలి : పాఠాలను బోధిస్తున్న భాస్కరరావు


బలగ : పాఠాలను బోధిస్తున్న శ్యామల

రణస్థలం : రణస్థలం శాఖాగ్రంథాలయం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి విద్యార్థులతో దినపత్రికలు చదవడం, కథలు చదివించడం, రాయించడం చేయించారు. ముఖ్య అతిథిగా ఆంగ్ల ఉపాధ్యాయులు కె.భాస్కరరావు పాజిటివ్‌లో సింగ్లర్ ఫ్లోరల్ గురించి వివరించారు. విశ్రాంతి ఉద్యోగి ఆర్.ధర్మారావు నీతి కథలు చెప్పారు. చదువుతో పాటు చెస్, క్యారమ్స్, పజిలు, బిజినెస్ గేమ్ తదితర ఆటల్లో పాల్గొన్నారు.

టెక్కలి : మారుతున్న కాలంలో ఆంగ్లం భాషపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశ్రాంత ఆంగ్ల లెక్చరర్ నంబూరు భాస్కరరావు అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆంగ్లంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి రామకృష్ణ, నిర్వాహకులు ఎస్.ఉదయ్‌కిరణ్, అమ్మనమ్మ పాల్గొన్నారు.